సాక్షి
అన్నమయ్య జిల్లా
సోమవారం । 11 । డిసెంబర్ । 2023



గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి

గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ప్రభుత్వ విద్యా సలహాదారు సాంబశివారెడ్డి అన్నారు. -8లో



రెవెన్యూపై ప్రైవేటు కన్ను!

పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నిర్మాణంలోని రెవెన్యూ అతిథిగృహాన్ని అద్దె పేరుతో దక్కించుకునేందుకు ప్రైవేటు వ్యక్తులు పావులు కదుపుతున్నారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 221 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు 'స్పందన'

రాయచోటి: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు(సోమవారం) 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్‌స్థాయిలో కూడా కార్యక్రమం జరుగుతుందన్నారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: శబరిమల అయ్యప్పస్వామి దర్శనంకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు మదనపల్లె ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఎటువంటి ఆర్టీవో పన్నులు ఉండవన్నారు. కేరళలో బస్సులకు పార్కింగ్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం ఉందన్నారు. ఏడుగురికి (వంట మనుషులు, మణికంఠస్వామి, అటెండరు)లకు ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. భక్తుల కోరిక మేరకు బస్సులు కావాల్సిన రూటులో, కావాల్సిన రోజులు అద్దెకు ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని అయ్యప్పభక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎఫ్ఆర్ఓ సంఘ అధ్యక్షుడిగా మదన్‌మోహన్‌రెడ్డి



బి.కొత్తకోట: తిరుపతి సర్కిల్ అటవీక్షేత్రాధికారులు (ఎఫ్ఆర్ఓ) సంఘం నూతన అధ్యక్షుడిగా మదనపల్లె ఎఫ్ఆర్ఓ కే.మదన్‌మోహన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నిక వివరాలను ఆయన తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షుడిగా బి.సుదర్శన్‌రెడ్డి (తిరుపతి), కార్యదర్శిగా ఎస్.లక్ష్మీపతి (తిరుపతి స్క్వాడ్), సహాయ కార్యదర్శిగా పి.మాధవి (కాణిపాకం), కోశాధికారిగా ఆర్.నారాయణ (రాజంపేట) ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ తిరుపతి పీసీసీఎఫ్ నాగేశ్వరరావును కలిసి ఆయనను సత్కరించారు.


కౌమార విద్యపై సదస్సు

రాయచోటి: రాయచోటిలోని జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఒకరోజు కౌమార విద్యపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ ఎద్దుల రాఘవరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు అన్నమయ్య జిల్లాలో ఎంపిక చేసిన 55 హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శిక్షణలో పాల్గొనాలని, 13వ తేదీన వైఎస్సార్ జిల్లాలో ఎంపిక చేసిన 81 హైస్కూల్ ప్రధానోపా.ధ్యాయులకు కడప చిన్నచౌక జయనగర్ కాలనీ లోని గర్ల్స్ జెడ్పీ హెచ్ హైస్కూల్‌లో నిర్వహించే శిక్షణకు హాజరు కావాలని ఆయన తెలిపారు.

మిషన్ ఇంద్రధనుస్సును విజయవంతం చేద్దాం

రాయచోటి అర్బన్: శిశువులు, గర్భిణుల్లో 100 శాతం రోగనిరోధకతను పెంచే సరికొత్త మిషన్ ఇంద్రధనుస్సును విజయవంతం చేద్దామని అన్నమయ్యజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.కొండయ్య కోరారు. 5 సంవత్సరాల లోపు పిల్లలు, గర్భిణులకు ఇప్పటి వరకు అందని వ్యాధినిరోధక టీకాలను అందేలా చేయడమే కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు.ఇదే సమయంలో మీసిల్స్, రూబెల్లా వ్యాధులను 2023 సంవత్సరానికి తరిమివేయడమే లక్ష్యమన్నారు. పిల్లలు, గర్భిణులకు డిసెంబర్ 11వ తేదీ నుంచి 16వరకు టీకా వేసే కార్యక్రమం జరుగుతుందన్నారు.

ప్రపంచ పోటీలకు ఎంపిక



సాయినాథ్‌నాయక్

కురబలకోట: ప్రపంచ స్ట్రెంత్ లిఫ్టింగ్ ఇంక్‌లైన్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్–2032 పోటీలకు అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ మెకానికల్ మొదటి సంవత్సరం విద్యార్థి ఎం. సాయినాథ్‌నాయక్ ఎంపికయ్యాడు. ఈ విషయాన్ని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్. విజయభాస్కర్ చౌదరి ఆదివారం తెలిపారు. రాజమహేంద్రవరం గౌతమి వ్యాయామ కళాశాలలో ఇటీవల జరిగిన ఆంధ్రా జోనల్ పురుషుల బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్‌పోటీల్లో సాయినాథ్‌నాయక్ రజత పతకం సాధించాడన్నారు. 80 కిలోల బరువు ఎత్తి ప్రతిభ కనపరిచి ప్రపంచ స్ట్రెంత్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. హైదరాబాదు ఎల్‌బీ స్టేడియంలో ఈనెల 18 నుండి 21 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

సాధికార చైతన్యం.. పోటెత్తిన జనం



సభలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు,
చిత్రంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

- వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతం
- ఉత్సాహ భరితంగా పాల్గొన్న ప్రజలు
- హోరెత్తిన నినాదాలు



అంబేడ్కర్, పూలే, జగ్జీవన్‌రామ్, అబుల్ కలాం ఆజాద్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



సామాజిక సాధికార బస్సుయాత్రకు హాజరైన జన సందోహం

కడప కార్పొరేషన్: కమలాపురం నియోజకవర్గంలో సామాజిక సాధికార చైతన్యం ఎగసిపడింది. చెన్నూరు కొండపేట వద్ద నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర సంరంభం అంబరాన్నంటింది. నియోజకవర్గ నలుమూలల నుంచి వెల్లువలా తరలివచ్చిన జనంతో కొండపేట బ్రిడ్జి పోటెత్తింది. వీఎన్‌పల్లి, పెండ్లిమర్రి, వల్లూరు, కమలాపురం, సీకేదిన్నె, చెన్నూరు మండలాల నుంచి 436 బస్సులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి సుమారు 20 వేల మంది జనం తరలివచ్చారు. ఆదివారం ఉదయం నుంచే చెన్నూరులో ఉత్సాహ భరిత వాతావరణం నెలకొంది. బ్రిడ్జి పొడవునా ఇరువైపులా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు కట్టారు. మధ్యాహ్నం సభ మొదలు కానుండటంతో జనానికి ఎక్కడికక్కడ భోజన ఏర్పాట్లు చేశారు. వైవీయూ, తోళ్లగంగనపల్లె, జయరాజ్ గార్డెన్, చెన్నూరు ప్రాంతాల్లో భారీ ఎత్తున భోజన ఏర్పాట్లు చేశారు. మహిళల కోసం కొండపేట బ్రిడ్జి వద్ద ప్రత్యేకంగా తెప్పించిన మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సుమారు 850 మీటర్ల పొడవున్న కొండపేట బ్రిడ్జి మధ్యాహ్నం 2 గంటలకే జన సందోహంతో నిండిపోయింది. ప్రధాన వక్తలు మాట్లాడుతున్నప్పుడు సభలో ఉన్న వారు వైఎస్సార్‌సీపీ టోపీలు, వైఎస్ జగన్ మాస్కులు ధరించి, జెండాలు చేతబూని, ప్లకార్డులు ప్రదర్శించారు. జై జగన్, జయహో జగన్ అనే నినాదాలు హోరెత్తాయి. మొత్తం మీద సామాజిక సాధికార బస్సుయాత్ర బ్రహ్మాండంగా విజయవంతమైంది. మధ్యాహ్నం 3.35 గంటలకు ప్రారంభమైన సభ 5.15కు ముగిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆదిమూలపు సురేష్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, ఎంవీ రామచంద్రారెడ్డి, ఆర్టీసీ చైర్మన్ ఎ.మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్‌ఏ కరిముల్లా, ఏపీ సోషల్ వెల్ఫేర్‌బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, టీటీడీ బోర్డు సభ్యులు యానాదయ్య, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ హయాంలోనే బ్రిడ్జి నిర్మాణం



బ్రిడ్జి నిర్మించాలని కొండపేట వాసులు గతంలో ఎన్ని ప్రభుత్వాలను కోరినా ఎవరూ పట్టించుకోలేదు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అధికారంలోకి వచ్చిన కొన్నాళ్లకే బ్రిడ్జి నిర్మించి ఈ ప్రాంత వాసుల కల నెరవేర్చారు. చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ బకాయిలు రూ.16 కోట్లను తీర్చేశారు. – వైఎస్ అవినాష్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు, కడప

గతంలో కాగితాలకే పరిమితం



సామాజిక సాధికారత అనేది గతంలో కాగితాలకే పరిమితమైంది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాకే చేతల్లో చూపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయంగా అధికారం, గుర్తింపు ఇచ్చారు. ఇప్పుడు మన సమయం వచ్చింది. ఇంత మంచి చేసిన జగనన్నకు అండగా ఉందాం. – బుట్టా రేణుక, మాజీ ఎంపీ, కర్నూలు

రూ.4450 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి



కమలాపురం నియోజకవర్గంలో రూ.4450 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పులివెందుల తర్వాత అత్యధికంగా అభివృద్ధి పనులు జరుగుతున్న నియోజకవర్గం మనదే. ఈ నాలుగున్నరేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా తమ నియోజకవర్గ ప్రజలకు రూ.1450 కోట్ల లబ్ధి చేకూరింది. – పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే, కమలాపురం

ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా పాలన



ఈ నాలుగున్నరేళ్లలో ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టేలా జగనన్న పాలన చేశారు. పేదరికాన్ని అంతమొందించేందుకు దేశంలో మేటి సంక్షేమ పథకాలను అమలు చేశారు. సాధికారత నినాదం కాదు మా విధానం అని నిరూపించారు. మహాత్మాగాంధీజీకి నిజమైన వారసుడు జగనే. – పి. నరేన్ రామాంజులరెడ్డి, జెడ్పీటీసీ, సీకేదిన్నె

ఉత్సాహంగా మ్యాథ్ 'బి'



జీఎంఆర్ హైస్కూల్‌లో నిర్వహించిన మ్యాథ్ బి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

SAKSHI MATH BEE 2023-24

వైవీయూ: లెక్కలంటే అన్నీ చిక్కులే.. అర్థం చేసుకున్న వారికి మాత్రం ఆసక్తికరం. చిన్న వయసులో నేర్చుకునే గణిత చిట్కాలు జీవితాంతం గుర్తుండి పోతాయనేది నిపుణుల మాట. విద్యార్థుల్లో గణితం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టి.. వారిలో గణితం పట్ల ఆసక్తి పెంచేలా.. చిన్న చిన్న సమస్యలు మొదలు.. వారి స్థాయిని అనుసరించి నిర్వహించిన సాక్షి మ్యాథ్ 'బి' కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కడప నగరంలోని జీఎంఆర్ హైస్కూల్‌లో ఆదివారం సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో డ్యూక్స్ వ్యాపి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త సహకారంతో నిర్వహించిన మ్యాథ్ 'బి' రెండో రౌండ్ కాంపిటీషన్ నాలుగు కేటగిరీలుగా నిర్వహించారు. కేటగిరీ–1లో 1, 2 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–2లో 3,4 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–3లో 5, 6,7 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–4లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్‌లో కడప హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, జీఎంఆర్ హైస్కూల్, సింహాద్రిపురం మండలం గురిజాల గ్రామానికి చెందిన నేతాజీ హైస్కూల్ విద్యార్థులు హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారు.

మ్యాథ్స్ అంటే ఎంతో ఇష్టం



నాకు గణితం అంటే ఎంతో ఇష్టం. సాక్షి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యాథ్ 'బి' కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు వచ్చాను. ఈ కాంపిటీషన్ ఎంతో బాగుంది. వచ్చే ఏడాది కూడా ఈ కాంపిటీషన్‌లో పాల్గొంటా. – ఎస్.శాన్విక, 4వ తరగతి, నేతాజీ హైస్కూల్, గురిజాల, సింహాద్రిపురం మండలం

మ్యాథ్స్ మేడ్ ఈజీ..



గణితం అంటే ఎంతో ఆసక్తి. గణితాన్ని సులువుగా నేర్చుకునేందుకు ఎప్పుడూ సిద్ధమవుతుంటా. మ్యాథ్స్ కాంపిటీషన్స్ ఎక్కడ ఉన్నా పాల్గొంటా. గణితంపై ఉన్న ఇష్టమే నన్ను ఈ కాంపిటీషన్‌లో పాల్గొనేలా చేసింది. – జి.విద్య, 3వ తరగతి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడప

గణిత భావనలపై పట్టు సాధించేందుకు..



గణితంలో రాణిస్తే అన్నింటా రాణించే అవకాశం ఉంది. అందుకే గణితంపై పట్టు సాధించేందుకు బేసిక్స్ నుంచి పట్టుసాధిస్తున్నా. ఇందులో భాగంగా మ్యాథ్'బి'లో సత్తా తెలుసుకునేందుకు వచ్చాను. కాంపిటీషన్ చాలా బాగుంది. – యు.శరణ్యసాయి, 7వ తరగతి, జీఎంఆర్ హైస్కూల్, కడప

గణితం పట్ల భయం పోయింది



గణితం అంటే.. ఎక్కడో ఏదో ఒకమూల కొద్దిపాటి భయం ఉండేది. అయితే ఈ కాంపిటీషన్‌లో పాల్గొన్న తర్వాత నేను కూడా చక్కగా గణిత సమస్యలను పరిష్కరించగలనన్న నమ్మకం కలిగింది. సాక్షి మ్యాథ్ 'బి' కాంపిటీషన్ నిర్వహణ బాగుంది. – చరణ్‌రెడ్డి, 6వ తరగతి, జీఎంఆర్ హైస్కూల్, కడప

స్పెల్'బి' కాంపిటీషన్‌కు విశేష స్పందన

- పెద్ద సంఖ్యలో విద్యార్థుల హాజరు
- ఆంగ్లంపై ఆసక్తి పెరుగుతుందంటున్న చిన్నారులు



నాగార్జున మోడల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న స్పెల్ 'బి' కాంపిటీషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

SAKSHI SPELL Bee 2023-24

వైవీయూ: సాక్షి మీడియా ఆధ్వర్యంలో డ్యూక్స్ వ్యాపి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త సహకారంతో నిర్వహిస్తున్న స్పెల్ 'బి' కాంపిటీషన్‌కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన స్పెల్ 'బి' కాంపిటీషన్ క్వార్టర్ ఫైనల్ రౌండ్‌కు చక్కటి స్పందన లభించింది. ఈ కాంపిటీషన్‌కు జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరై తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. ఆంగ్లంపై మక్కువ పెంచేలా, ఆసక్తి కలిగించేలా ప్రయత్నం చేస్తున్న 'సాక్షి'కి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమైన ఈ కాంపిటీషన్ మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగింది. ఇందుకు పెద్దసంఖ్యలో విద్యార్థులు వచ్చి, ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంగ్లం పట్ల ఉన్న భయాన్ని పోగొట్టేలా.. భాషపై పట్టుసాధించేలా కాంపిటీషన్ ఉందంటూ విద్యార్థులు పేర్కొన్నారు. కాగా ఆదివారం నిర్వహించిన కాంపిటీషన్‌లో కేటగిరీ–1లో 1, 2 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–2లో 3, 4 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–3లో 5, 6, 7 తరగతుల విద్యార్థులు, కేటగిరీ–4లో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కాంపిటీషన్‌కు కడప నగరంలోని నాగార్జున మోడల్ స్కూల్, జీఆర్‌టీ–జీవీకే హైస్కూల్, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, జీఎంఆర్ హైస్కూల్, సింహాద్రిపురం మండలం గురిజాలకు చెందిన నేతాజీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంగ్లిషు అంటే ఆసక్తి పెరిగింది



స్పెల్ 'బి' కాంపిటీషన్‌లో పాల్గొనడం వల్ల ఇంగ్లిషు భాష పట్ల ఆసక్తి పెరిగింది. ఇందుకోసం కొత్త పదాలను నేర్చుకున్నాను. ఈ స్పెల్లింగ్స్ నేర్చుకోవడం నాకు అకడమిక్‌గా కూడా ఉపయోగకరం. – పి.నవనీష్, 3వ తరగతి, నాగార్జున మోడల్‌స్కూల్, కడప

అకడమిక్‌గా కూడా ఉపయోగం



సాక్షి స్పెల్'బి' కాంపిటీషన్ పరంగానే కాక అకడమిక్‌గా కూడా చాలా ఉపయోగపడుతోంది. కాంపిటీషన్ కోసం వందల్లో పదాలు నేర్చుకునే అవకాశం కలిగింది. తద్వారా అకడమిక్‌గా కూడా ఉపయోగపడుతుంది. – యుహానా, 7వ తరగతి, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడప

తొలిసారిగా రాస్తున్నా..



నాకు ఇంగ్లిషు అంటే ఎంతో ఇష్టం. కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో నేను ఈ కాంపిటీషన్‌లో పాల్గొనేందుకు వచ్చాను. మాకు ఇచ్చిన మెటీరియల్‌లో చాలా పదాలకు స్పెల్లింగ్స్ నేర్చుకున్నా. – బి.ఎస్. రిషిత, 2వ తరగతి, నేతాజీ హైస్కూల్, గురిజాల, సింహాద్రిపురం మండలం

ఆంగ్లంపై పట్టు సాధించేందుకు..



ఆంగ్లభాష పట్ల ఉన్న ఆసక్తే ఈ కాంపిటీషన్‌కు హాజరయ్యేలా చేసింది. ఆంగ్లభాషలో పట్టుసాధించాలన్న నా లక్ష్యానికి ఈ కాంపిటీషన్ దోహద పడుతుంది. ఇందుకోసం బాగా ప్రిపేర్ అయ్యాను. – ఎం.వెంకటసాయిలక్ష్మి, 4వ తరగతి, జీఆర్‌టీ జీవీకే హైస్కూల్, కడప

వైభవంగా కలశ ప్రతిష్ట



కలశాలను తీసుకొస్తున్న గడికోట మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు



శ్రీ వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న గడికోట మోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయ పశ్చిమ రాజగోపుర కలశప్రతిష్టను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ గోపురంపైకి ఆలయ ప్రధాన అర్చకులు, పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిలు వెళ్లి కలశస్థాపన చేశారు. లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి సతీసమేతంగా, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సతీమణి గడికోట లలితారెడ్డి కలశ ప్రతిష్ట పూజలో పాల్గొన్నారు. వేదమంత్రోచ్చారణల మధ్య రాజగోపురంపై కలశ ప్రతిష్ట చేసిన తరువాత మహా పూర్ణాహుతి సమర్పించారు. బలిహరణ, వేదాశీర్వాదంతో స్వామివారి పశ్చిమ రాజగోపుర కుంభాభిషేక మహోత్సవం ముగించారు. పూజల్లో స్థానిక భక్తులు, కన్నడ భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వారికి మధ్యాహ్నం ఉచిత అన్నప్రసాదం అందించారు. అంతకుముందు స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

భళా.. రక్షక భట నిలయం

- ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయానికి అధునాతన భవనాలు
- రూ.3.50 కోట్లతో నిర్మాణం
- నేడు ప్రారంభించనున్న డీజీపీ, ఎమ్మెల్యే



డీఎస్పీ కార్యాలయ భవన సముదాయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంశాలపై స్థానిక ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి జిల్లా అధికారులతో కలిసి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో డీఎస్పీ కార్యాలయంతోపాటు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు విశాలమైన స్థలంలో రూ.3.50 కోట్లతో అధునాతన భవనాలు నిర్మించారు. రాయచోటిని జిల్లా కేంద్రం చేయడంలోనూ, జిల్లా, డివిజన్ స్థాయి కార్యాలయాలకు స్థలాల కేటాయింపు, అధునాతన భవనాల నిర్మాణంలోనూ మరీ ముఖ్యంగా శాంతి భద్రతల పరిరక్షణ, రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డిలు తీసుకుంటున్న చొరవ సత్ఫలితాల దిశగా అడుగులు పడుతున్నాయి. జిల్లా కేంద్రం కాకమునుపే రాయచోటిలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయం మంజూరు చేయించారు. రాయచోటి పట్టణ ప్రాంతంలో జనాభా విస్తరిస్తున్న దృష్ట్యా ట్రాఫిక్ నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు అనుగుణంగా పోలీస్ కార్యాలయాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపారు. ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ చేయడంతో సీఐ స్థాయి అధికారి నియామకం కూడా పూర్తయింది. ప్రజలకు మరింత చేరువగా పోలీసు సేవలు అందించేందుకు పట్టణంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి రూ.2 కోట్లు, డీఎస్పీ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.50 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌ను పట్టణ పరిధి చిత్తూరు మార్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఎస్టీ కాలనీ వద్ద 1.14 ఎకరాల విస్తీర్ణంలోను, డీఎస్పీ కార్యాలయాన్ని కడప రహదారి మార్గంలో ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా 1.50 ఎకరాల విస్తీర్ణంలో అత్యంత సుందరంగా, శరవేగంగా భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఇవి ఈ నెల 11వ తేదీన ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి.

ప్రారంభానికి రానున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

డీఎస్పీ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కార్యాలయాల నూతన భవనాలు డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించేలా జిల్లా పోలీసు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, డీఎస్పీ కార్యాలయాలను ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఇందుకు తగ్గ ఏర్పాట్లపై డీఎస్పీ మహబూబ్ బాషా, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, కాంట్రాక్టర్లు శివమల్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలతో ఆయన చర్చించారు.

క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్ : గాలివీడు మండల పరిధిలోని ప్యారంపల్లె గ్రామం పెడకంటి కొత్తపల్లెలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలోఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమక్షంలో దాదాపు 30 కుటుంబాల వారు పార్టీ కండువాలు ధరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన పట్ల ఆకర్షితులై వారు పార్టీలో చేరినట్లు తెలిపారు. రాష్ట్రమంతటా వైఎస్సార్‌సీపీలోకి వలసలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆవుల నాగభూషణ్‌రెడ్డి, సర్పంచ్ సతీష్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఖాదర్ వలీ, సర్పంచ్‌లు చెన్నకేశవులరెడ్డి, ఉమాపతిరెడ్డి, సచివాలయ కన్వీనర్ రమణారెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లాప్‌ట్యాప్ దొంగ అరెస్ట్

మదనపల్లె : హైటెక్ బస్సుల్లో ప్రయాణిస్తూ, తోటి ప్రయాణికులు ఆదమరిచి నిద్రపోయినప్పుడు అదును చూసుకుని లాప్‌ట్యాప్‌లను చోరీచేసే దొంగను ఆదివారం అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ ఇన్‌చార్జి సీఐ వలీబాషు తెలిపారు. మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్‌లో ఇటీవల లాప్‌ట్యాప్ పోగొట్టుకున్న బాధితుడి ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్టాండులోని సీసీ టీవీ పుటేజ్‌ల ఆధారంగా దర్యాప్తు చేశామన్నారు. అందులో మహారాష్ట్రకు చెందిన షేక్ జావిద్(34)ను నిందితుడిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. విచారణలో బస్సుల్లో లాప్‌ట్యాప్‌లు చోరీ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.లక్ష విలువచేసే 6 ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

లాడ్జిలో అనారోగ్యంతో వ్యక్తి మృతి

కడప అర్బన్ : కడప నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో ఓ లాడ్జిలో ఈనెల 8వ తేదీన విశ్రాంతి తీసుకునేందుకు వచ్చిన డి. సుదర్శన్ శర్మ (42) అనే వ్యక్తి ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అనంతపురం జిల్లా గుంతకల్‌లోని తిలక్‌నగర్‌కు చెందిన మృతుడు కడపకు పనిమీద వచ్చాడు. అతని బంధువులకు పోలీసులు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించండి

అట్లూరు : వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను నెరవేరిస్తే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లిపోగు నాగేశం తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

రెవెన్యూపై ప్రైవేటు కన్ను!

- అద్దె పేరుతో అతిథి గృహం దక్కించుకునే ప్రయత్నాలు
- మాకివ్వాలంటున్న టూరిజం అధికారులు
- హార్సిలీహిల్స్‌పై ప్రైవేటు హవా



హార్సిలీహిల్స్‌పై నిర్మాణం పూర్తికావొస్తున్న రెవెన్యూ అతిథి గృహ భవనం

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నిర్మాణంలోని రెవెన్యూ అతిథిగృహాన్ని అద్దె పేరుతో దక్కించుకునేందుకు ప్రైవేటు వ్యక్తులు పావులు కదుపుతున్నారు. రెవెన్యూ అతిథిగృహంపై కన్నేసిన వ్యక్తులు త్వరలో పూర్తికానున్న అతిథిగృహం నిర్వహణ లేదా అద్దె పేరుతో దక్కించుకొని లక్షలు ఆర్జించేలా ప్లాన్ వేశారు. కొండపై పాత రెవెన్యూ అతిథిగృహాన్ని గత ఏడాది మేలో పరిశీలించిన కలెక్టర్ గిరీషా, ఆర్డీఓ మురళీలు దాన్ని పడగొట్టి కొత్త భవనాన్ని సుందరంగా నిర్మించేలా నిర్ణయించారు. దీనికి అనుగుణంగా అధికారుల సూచనలతో పనులు మొదలయ్యాయి. పాత రెవెన్యూ భవనం, దానిపక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల భవనాన్ని కలుపుకొని పెద్ద అతిథి భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించి ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

కన్నేసిన ప్రైవేటు

కొందరు ప్రైవేటు వ్యక్తులు ఏదో ఒక ఒప్పందంతో రెవెన్యూ అతిథి గృహాన్ని దక్కించుకుంటే కొండపై తిరుగులేకుండా ఆదాయం సంపాదించవచ్చని పథకం వేశారు. రెండువైపులా మూడురోడ్ల కూడలితో ఉన్న ఈ భవనంలో 11 గదులు, రెండు వీఐపీ సూట్లను నిర్మిస్తున్నారు. అధికారులకు ఒకటి రెండు అతిథి గృహ గదుల అవసరం ఉండొచ్చు. మిగిలిన గదులను రోజు వినియోగించుకునే పరిస్థితి లేదు. అయితే కొండపై అతిథి గృహాలకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కొందరు ప్రైవేటు వ్యక్తులు దీని నిర్వహణ లేదా అద్దె ప్రాతిపదికన ఇవ్వాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రతిపాదించినట్లు తెలిసింది. కొండపై ప్రైవేటు గృహాల్లో ఒక గదికి కొన్నిచోట్ల రూ.2వేలు, కొన్ని చోట్ల రూ.4 నుంచి రూ.6 వేలు వరకు వసూలు చేస్తున్నారు. శుక్ర-ఆదివారం మధ్యలో రద్దీ విపరీతంగా ఉంటుంది. ఆ సమయంలో డిమాండ్ సృష్టించి ఒక గదికి రూ.7 వేలు కూడా వసూలు చేస్తున్నారు. దీనితో రెవెన్యూ అధికారులకు కొంత మొత్తాన్ని చెల్లించి అద్దె కింద 11 గదులను దక్కించుకుంటే వాటిని సందర్శకులకు అద్దెకు ఇచ్చి రోజుకు కనీసం రూ.50 నుంచి రూ.60 వేలు దక్కించుకోవచ్చని భావిస్తున్నట్లు తెలిసింది. ఇదే జరిగితే కొండపై పర్యాటకశాఖకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ విషయమై ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.

టూరిజంకు ఇవ్వండి

హార్సిలీహిల్స్‌పై ప్రైవేటు అతిథిగృహాల నిర్వహణ వల్ల పర్యాటకశాఖకు ఆదాయపరంగా తీవ్ర నష్టం వాటిల్లుతోంది. దీంతో రెవెన్యూ అతిథిగృహాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించకుండా చర్యలు తీసుకోవాలని పర్యాటకశాఖ అధికారులు సీఎంఓ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. నివేదిక రూపంలో పర్యాటకశాఖ ఎండీ దృష్టికి ఈ విషయం వెళ్లగా ఆయన ఈ మేరకు స్పందించినట్లు సమాచారం. రెవెన్యూ అతిథి గృహం టూరిజంకు అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు అద్దె ఎంత నిర్ణయించినా చెల్లిస్తామని ఆ శాఖ అధికారులు విన్నవించినట్లు తెలిసింది. తద్వారా నిర్వహణ ప్రభుత్వశాఖ పరిధిలోనే ఉంటుందని, ఆదాయం కూడా ప్రభుత్వానికే లభిస్తుందని అంటున్నారు.

ప్రైవేటుకు అద్దేలేదు

హార్సిలీహిల్స్‌పై ప్రైవేటు అతిథి గృహాల అద్దె వసూళ్లకు అడ్డేలేకుండా పోయింది. ప్రభుత్వశాఖల తనిఖీలు లేకపోవడంతో ఇళ్లను అతిథి గృహాలుగా మార్చేశారు. అతిథి గృహాల వ్యాపారం రూ.కోట్లలో సాగుతున్నా ప్రభుత్వశాఖల అధికారులు వీటిపై దృష్టి సారించలేదు. అలాగే వీరు వినియోగిస్తున్న విద్యుత్ కూడా గృహ అవసరాల కింద చూపుతూ వాణిజ్య అవసరాలకు వినియోగించుకొంటున్నారు. ఫలితం డిస్కంల ఆదాయానికి నష్టం వాటిల్లుతోంది. పర్యాటకశాఖలో రూ.1,400కు అతిథిగృహం అద్దెకు లభిస్తుంది. ఉదయం ఇద్దరికి అన్ లిమిటెడ్ అల్పాహారం ఉచితం. 24 గంటల సర్వీసు, సందర్శకులకు భద్రత ఉంటుంది. ప్రైవేటులో తక్కువ ధరకు గదులు లభ్యం కావడం గగనం. పర్యాటకశాఖ మాదిరి సౌకర్యాలు ఉండవు. అద్దెలు అధికం. అయినప్పటికి వీటిపై నియంత్రణ లేకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు నష్టపోతున్నారు. హార్సిలీ హిల్స్‌పై కొనసాగుతున్న ప్రైవేటు వ్యక్తుల దందాకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

కడపలో ఇరువర్గాల ఘర్షణ

కడప అర్బన్ : కడప నగరంలోని కో–ఆపరేటివ్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటూ అన్నమయ్య జిల్లాలో ఇంటెలిజెన్స్ విభాగంలో పనిచేస్తున్న అధికారికి, నెహ్రూపార్క్ సమీపంలోని ఓ ప్రముఖ హోటల్‌లో పనిచేస్తున్న వారికి ఈనెల 9వ తేదీరాత్రి శనివారం వాగ్వాదంతో ప్రారంభమై ఘర్షణకు దారి తీసింది. వివరాలిలా..హోటల్‌లో పనిచేస్తున్న వారు తమ పని ముగించుకుని తాము అద్దెకుంటున్న గదులకు విశ్రాంతి కోసం వచ్చారు. ఆ సమయంలో కేకలు వేస్తున్నారని పోలీసు అధికారి వారిని వారించారు. అదే సమయంలో హోటల్‌లో పనిచేస్తున్న యువకులు కూడా వాగ్వాదానికి దిగారు. పరస్పరం ఘర్షణకు దిగారు. ఈ క్రమంలో ఇరువర్గాల వారు కడప ఒన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నట్లు సమాచారం. ఈ సంఘటనపై కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

వృద్ధురాలి నేత్రదానంతో ఇద్దరు అంధులకు చూపు

వేంపల్లె : వృద్ధురాలి నేత్రదానం ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించిందని నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజు పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లె పట్టణం కరణం వీధికి చెందిన బాలం సంజీవమ్మ అనే వృద్ధురాలు మరణించడంతో ఆమె కుమారుడు నాగమల్లయ్య కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ నేత్రనిధి సంస్థ అధ్యక్షుడు రాజుకు సమాచారం ఇచ్చారు. దీంతో రాజు టెక్నీషియన్ హరీష్‌తో కలిసి హుటాహుటిన మృతురాలి ఇంటికి చేరుకుని మృతదేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపారు. ఈ సందర్భంగా నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ కుటుంబంలో వ్యక్తి లేదా సన్నిహితులు మరణించిన సమయంలో నేత్రదానం పట్ల అవగాహన కల్పించి 9966509364, 7093204537 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అస్తవ్యవస్తంగా ఉన్న సర్కారు బడుల రూపురేఖలు మార్చేశారు.. పేదలకు సొంతింటి కల సాకారం చేస్తున్నారు. సచివాలయాల ద్వారా క్షణాల్లో ప్రతి పని జరుగుతోంది. ఫలితంగా పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

నా బిడ్డలను బాగా చదివిస్తున్నా



నా భర్త వెంకటరమణారెడ్డి. ఓ బేకరీ షాపులో పని చేస్తున్నాడు. నాకు జ్ఞానప్రకాష్, రోహిత్‌కుమార్ ఇద్దరు పిల్లలు. పిల్లలను చదివించాలంటే కష్టంగా ఉండేది. పుస్తకాలు, యూనిఫాం కొనాలంటే అప్పులు చేయాల్సి వచ్చేది. జగనన్న సీఎం అయ్యాక మా బిడ్డకు అమ్మ ఒడి కింద డబ్బులు వస్తున్నాయి. స్కూళ్లో జగనన్న విద్యాకానుక పేరుతో అన్ని ఉచితంగా ఇచ్చారు. జగనన్న మేలు మరువలేము.

–శిరిషా, బీటీ కాలేజీ రోడ్డు, మదనపల్లె

సొంతిల్లు వచ్చింది



గతంలో నాకు పాత కొట్టం ఉండేది. వర్షం వస్తే ఇంటిలో ఉండేదానికి చాలా ఇబ్బంది పడేదానిని. జగనన్న ప్రభుత్వం వచ్చాక సొంత ఇల్లు మా గ్రామానికి దగ్గరలోనే మంజూరు చేసి పట్టా ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– బిక్కి క్రిష్ణవేణి, రెడ్డివారిపల్లె గ్రామం, రైల్వేకోడూరు మండలం

ఒకే రోజులో ధ్రువపత్రాలు



గతంలో ధ్రువపత్రాలు కావాలంటే కాళ్ల అరిగేలా కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వచ్చేది. అయినా కూడా సమయానికి ధ్రువపత్రం అందేది కాదు. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంతో ఎక్కడికి వెళ్లకుండా నాకు కావాల్సిన కులం, ఆదాయం ధ్రువపత్రాలు ఒక్క రోజులోనే అందించారు. ఇంత సులభతరంగా ధ్రువపత్రాలు అందించిన సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

–ఎం. వెంకటమల్లమ్మ, కంచంవారిపల్లె, పీలేరు మండలం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధం



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన టీవీ

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నాగిరెడ్డిపల్లె గ్రామం, డీఎంసీ రోడ్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల పలు గృహాలలో ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు బాధితుల కథనం మేరకు.. గుర్రప్పు జయలక్ష్మమ్మ ఇంటిలో టీవీ పేలిపోయి, తులం బంగారంతోపాటు పలు వస్తువులు అగ్నికి ఆహుతి అయ్యాయి. నాగిరెడ్డిపల్లె కోర్టు సమీపంలో గల దర్గావద్ద ఇటీవల తుపాను వల్ల వీచిన గాలి వానకు ఒరిగిపోయిన చెట్లను అనుమతి లేకుండా కొందరు తొలగించేందుకు ప్రయత్నిస్తుండగా విద్యుత్‌ను సరఫరా చేసే మెయిన్ వైర్లపై చెట్టు కొమ్మలు పడ్డాయి. దీంతో ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు పలువురి ఇళ్లలోని టీవీలు, ఫ్రిజ్‌లతోపాటు పలు ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోయినట్లు బాధితులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న బియ్యం పట్టివేత



పట్టుబడిన బియ్యంతో రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మాసూం బాషా

రాయచోటిటౌన్ : అక్రమంగా తరలిస్తున్న చౌక దుకాణం బియ్యాన్ని కడప రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసూం బాషా స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఆయన తన బృందంతో కలసి రాయచోటి పట్టణం మాసాపేట సమీంలోని శ్రీ రామానంద స్వామి రైస్ మిల్లుపై దాడి నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉంచిన 44 బస్తాల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం టి.సుండుపల్లె మండలం జంగంపల్లెకు చెందిన కొండ్రు శ్రీనివాసులు అనే డీలర్ షాపు నుంచి తరలించినట్లు గుర్తించారు. ఈ బియ్యంతో పాటు బొలేరో పికప్ వాహనం కూడా స్వాధీనం చేసుకున్నారు. డీలర్ కొండ్రు శ్రీనివాసులతో పాటు రైస్ మిల్లు యజమాని ఎం.విజయ్‌కుమార్, ఎం. గురుస్వామిలపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన బియ్యం, వాహనం విలువ రూ.1,68,710లు ఉంటుందని తెలిపారు. బియ్యంతో పాటు వాహనాన్ని రాయచోటి డిప్యూటీ తహసీల్దార్ ఉనిత్‌కుమార్‌కు అప్పగించినట్లు వివరించారు.

అయ్యప్ప భక్తుడు గుండెపోటుతో మృతి



మృతి చెందిన రంగనాయకులు

మదనపల్లె : అయ్యప్ప మాలధారణలో భజన నిమిత్తం పులివెందుల సమీపంలోని మోపూరి భైరవేశ్వరస్వామి ఆలయానికి వెళుతున్న ఓ అయ్యప్ప భక్తుడు మార్గమధ్యంలో గుండెపోటుతో మరణించిన ఘటన ఆదివారం జరిగింది. అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన ఓబులేసు కుమారుడు జి.రంగనాయకులు(58) ఎనిమిదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు వచ్చి చేనేతకార్మికుడిగా స్థిరపడ్డాడు. కుమారుడు భాస్కర్ ఎస్‌బీఐ కాలనీ వార్డు వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. పోతబోలు జగనన్న లేఅవుట్‌లో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో సొంత ఇల్లు నిర్మించుకుని కాపురం ఉంటున్నారు. పదిరోజుల క్రితం అయ్యప్ప మాలధారణ చేశారు. పులివెందుల నియోజకవర్గంలోని మోపూరి భైరవేశ్వర ఆలయాన్ని దర్శించుకునేందుకు నీరుగట్టువారిపల్లెలోని తోటి అయ్యప్ప స్వాములతో కలిసి ఐషర్ వాహనంలో బయలుదేరారు. బండిలో దారిపొడవునా అయ్యప్ప భజనలు చేసుకుంటూ, భక్తిపారవశ్యంలో, తన్మయత్వంతో స్వామియే శరణం అయ్యప్పా అంటూ బిగ్గరగా పాట పాడుతూ మార్గమధ్యంలోని బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్‌వద్ద ఉన్నట్లుండి లారీలోనే కుప్పకూలిపోయాడు. దీంతో తోటిస్వాములు అదే వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అయ్యప్ప భక్తుడైన రంగనాయకులు గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం కుటుంబ సభ్యులు మృతదేహాన్ని స్వగృహానికి తీసుకెళ్లారు. మృతుడి భార్య నాగరత్నమ్మ భర్తకు గుండెపోటు వచ్చిన సమయంలో ఆయనతో పాటు ఐషర్ వాహనంలోనే ఉంది. తన కళ్ల ముందే భర్త మృతిచెందడంపై ఆవేదన వ్యక్తం చేసింది.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం కొత్తవారిపల్లె పంచాయతీ ఎనుములవారిపల్లెకు చెందిన బాబు కుమారుడు బి.దేవకుమార్(35) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగాడు. అదేవిధంగా అమ్మచెరువుమిట్ట వైఎస్ జగన్ కాలనీకి చెందిన వి.శ్రీనివాసులు భార్య వి.పార్వతి(55) తన కుమారుడు, కోడలు మధ్య మనస్పర్థల కారణంగా ఏర్పడిన సమస్యలతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు యత్నించింది. అలాగే కురబలకోట మండలం నల్లగుట్లపల్లె హరిజనవాడకు చెందిన కె.గంగులప్ప కుమారుడు నారాయణ(45) కుటుంబ సమస్యలతో విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

పాలేగారి వ్యవస్థకు చరిత్రలో స్థానం కల్పించాలి

పాలేగాళ్ల వారసుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశవులు నాయుడు



మాట్లాడుతున్న కేశవులు నాయుడు

సుండుపల్లె(రాయచోటి) : తెలుగు వారి సామాజిక భద్రతకు, ఆధ్యాత్మిక వికాసానికి, వ్యవసాయ అభివృద్ధికి సుమారు 500 సంవత్సరాల పాటు దోహదపడిన పాలేగారీ వ్యవస్థకు చరిత్ర పుటల్లో తగిన స్థానం దక్కకపోగా పాలేగాళ్లను సంఘ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించారని ఆంధ్రప్రదేశ్ పాలేగాళ్ల వారసుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎనుగొండ కేశవులునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం చింతకుంటబండపాలెం నరసింహస్వామి ఆలయం ఆవరణంలో ఆదివారం జరిగిన పాలేగాళ్ల వారసుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాకతీయ, విజయనగర, గోల్కొండ, మొగల్, మరాఠా పాలకుల కాలంలో రాష్ట్రంలో ముఖ్యంగా రాయలసీమలో పాలేగారీ స్థానిక పాలనా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేసిందన్నారు. అంతేకాకుండా ఆనాటి రాజ్యాలకు సైనిక సంపత్తిని అందజేసిందని, సామాజిక భద్రత కల్పించబడిందని ఆయన పేర్కొన్నారు. పాలేగాళ్ల వారసులు నేటికీ అనేక ప్రాంతాల్లో గ్రామ పెద్దలుగా ప్రజల నుంచి గౌరవం పొందుతున్నారన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ రచయిత, చరిత్రకారుడు తవ్వా ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో దత్త మండలాల ప్రధాన కలెక్టర్‌గా పనిచేసిన థామస్‌మన్రో తమ సామ్రాజ్య విస్తరణలో భాగంగా దమననీతితో అణచివేశాడన్నారు. ఆ సందర్భంగా పాలేగాళ్లకు తవర్జీ(పెన్షన్) ఏర్పాటు చేశారని, ఆ తవర్జీ ఇప్పుడు చాలా మందికి నిలిచిపోయిందన్నారు. పాలేగాళ్ల కుటుంబాలకు వారసత్వ హక్కుగా బ్రిటీష్ ప్రభుత్వం కల్పించిన ఆర్థిక ప్రయోజనాలను, సామాజిక గౌరవాన్ని కొనసాగించినప్పుడే స్థానిక పాలనా చరిత్రకు గౌరవం కల్పించినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న రచయిత ఫణిశేఖర్ మాట్లాడుతూ పాలేగాళ్ల వ్యవస్థకు సంబంధించిన కట్టడాలను సంరక్షించి ఆ చరిత్రను భావితరాలకు అందించాలని కోరారు. కడప సుందరీకరణలో భాగంగా కడప, రాయచోటిలలోని కూడళ్లలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహాన్ని పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాలేగాళ్ల వారసుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కొర్లకుంట జానకిరఘు మాట్లాడుతూ పాలేగాళ్లు నిర్మించిన చెరువులకు వారి పేర్లు పెట్టాలని, వారి హయాంలో నిర్మించిన దేవాలయాలలో వారి వారసులకు తగిన గౌరవం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి గురిగింజకుంట చంద్రప్పనాయుడు (యర్రమనేనిపాలెం), జి.మంగప్పనాయుడు (మోటకట్లనగిరి), ఎస్.ప్రభాకర్‌నాయుడు (నాగన్నకుంటపాలెం), పార్థసారథి నాయుడు (ఎనుగొండపాలెంనగిరి), మధుసూదన నాయుడు, వీరాంజులు నాయుడు, కుశలకుమార్ నాయుడు (చింతకుంటబండ), కన్నెమడుగు సుబ్బయ్య నాయుడు (ముటుకు క్రాస్ కొత్తపల్లి నగిరి) పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య



బలరామరాజు మృతదేహం

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రకృతినగర్‌లో నివాసం ఉంటున్న బలరామరాజు (62) అనే రిటైర్డ్ ఉద్యోగి అనారోగ్యంతో ఇంటిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన ప్రభుత్వ బాలుర గృహంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందాడు. ఏడాది కాలంగా మొలల వ్యాధితో బాధపడేవాడు. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో తీవ్రమానసిక వేదనకు గురయ్యాడు. దీంతో ఈనెల 9వ తేదీ రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రస్తుతం ఇతనికి భార్య జయప్రదమ్మ, కుమార్తె అనస్తీషియా డాక్టర్ సురేఖ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప తాలూకా ఏఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ద్విచక్రవాహనదారుడిని తప్పించబోయి..



ఆర్టీసీ బస్సును ఢీకొన్న సంఘటనలో టూరిస్టు బస్సు అద్దాలు పగిలిన దృశ్యం

రాయచోటిటౌన్ : ద్విచక్రవాహనంలో వెళ్తున్న వ్యక్తిని తప్పించబోయి ఆర్టీసీ బస్సు బ్రేకులు వేయడంతో వెనుక వస్తున్న టూరిస్టు బస్సు అద్దాలు పగలిపోయాయి. ఆదివారం రాయచోటి – చిత్తూరు రోడ్డు మార్గంలో హోండా షోరూంకు దగ్గరగా రాయచోటి వైపు నుంచి అయ్యప్ప భక్తులతో టూరిస్టు బస్సు తిరుపతి వెళ్తోంది. అదే సమయంలో పీలేరు వెళ్లే ఆర్టీసీ బస్సు కూడా ముందు వెళుతోంది. ఆ బస్సుకు ముందు వైపు బైకు వెళుతోంది. ఒక్కసారిగా బైకు చైన్ తెగిపోయింది. దీంతో బైకు వేగం తగ్గిపోయి పూర్తిగా ఆగిపోయింది. ఈ సమయంలో బస్సు ద్విచక్రవాహనదారుడిని తప్పించే ప్రయత్నంలో పక్కకు తిప్పడంతో పాటు వేగాన్ని నియంత్రించేందుకు బ్రేకులు వేశారు. ఆర్టీసీ బస్సు వెనకాలే వస్తున్న అయ్యప్ప భక్తుల బస్సు ఆర్టీసీ బస్సును ఢీకొంది. దీంతో టూరిస్టు బస్సుకు ముందువైపు ఉన్న అద్దాలు పగిలిపోయాయి. అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే ట్రాఫిక్ ఎస్ఐ మహమ్మద్ రఫీ వచ్చి ట్రాఫిక్‌ను నియంత్రించి వారిని అక్కడి నుంచి పంపించేశారు. ప్రమాదం పెద్దది కాకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి

ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి

కేవీపల్లె : గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి అన్నారు. ఆదివారం గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో గురుకుల ఆలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో 40 వసంతాల (రూబీ జూబ్లీ) వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఆలుమ్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాలలో సీసీ కెమెరాల ఏర్పాటు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 6 లక్షలు కేటాయించినట్లు చెప్పారు గ్యారంపల్లెలో గురుకుల పాఠశాల ఏర్పాటుకు కృషి చేసిన రెడ్డెప్పరెడ్డి విగ్రహం ఏర్పాటు చేశారు. అలాగే వారి కుటుంబ సభ్యులు రూ. 2 లక్షల చెక్‌ను ఆలుమ్ని అసోసియేషన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కియా మోటార్స్ ముఖ్య సలహాదారు టి. సోమశేఖర్‌రెడ్డి, ఆలుమ్ని ఉపాధ్యక్షుడు జె. సాల్మన్‌రాజు, పాఠశాల ప్రిన్సిపాల్ బ్రహ్మాజి, మాజీ ప్రిన్సిపాల్స్ పి. ఓబయ్య, ఎస్.వి. రమణ, ఆనందబాబు, సురేష్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.